# సుఖం

గడియారం ఎనిమిదిసార్లు ఆవలించింది. అయ్యగారు లేచి ఒక్కసారే ఆవలించారు. చిటికెలు వేసేరు. ఉలిక్కిపడ్డాడు కునుకుతున్న సీతారాములు. గది అలాగే వుంది. అది నిన్న రాత్రి పన్నెండు గంటలకి, తెల్లవారు జామున నాలుగున్నర గంటలకీ- అప్పుడు సూర్యుడు అవతల తెగ బారెడు పైకి సాగినప్పుడూ రూము అంతే, అలాగే వుంది. అయ్యగారి గది ఏర్ కండిషన్డు మరి! గడియారం ముళ్ళు రెండు చేతులా సూచించే వాతావరణ ప్రభావం గదిమీద పడదు!

సీతారాములు బయటకి దూసుకున్నాడు. అప్పటి కప్పుడే బట్లరు బెడ్ కాఫీ తెస్తున్నాడు. "దండాలండీ!" అన్నాడు సీతారాముల్ని చూసి. అందులో ఎకసక్కెమూ ఉంది, భయమూ ఉంది. ఆ రెండు గుర్తించని సీతారాములు 'అయ్యగారు లేచారు, ఆవలించారు." అన్నాడు. చిటికెలో గదిలోనికి దూసుకున్నాడు.

"ఎదవనాయాల! అయ్యగారి బాబుకి కూడా లేదు యీడి దరిజా!... సుఖపడ్రా నాయనా!" లోపల లోపల పళ్ళు కొరుక్కున్నాడు లోపలికి వచ్చిన బట్లర్ గురువులు.

అయ్యగారు కాఫీ చప్పరిస్తూనే సీతారాముల్ని చూసి "ఏమిట్రా! వెధవ దింత కసగా వుంది. కాఫీయా! కషాయమా?" అని గద్దించారు. బట్లరు వణికిపోయాడు. సీతారాములు మాత్రం "ఏర్ కండిషండ్ గదిలాగే మార్పులేకుండా 'కాస్త సుగర్' అంటూ యింత గ్లూకోజు నందులో కలిపేడు. ఆ విధంగా బట్లర్ అప్పుడు రక్షింప బడ్డాడు.

కాఫీ కసగా వుంటేనే కాదు. వెంకడు బూట్లు సరిగ్గా పాలిష్ చేయకపోయినా, చాకలి యిస్త్రీ మడతలు సరిగ్గా పెట్టకపోయినా, ఆఖరికి అమ్మగారు తనకి వడ్డన చేస్తానని స్వయంగా వచ్చినా అయ్యగారు సీతారాముల్నే సంజాయిషీ అడుగుతారు. వాడి దంత బాధ్యత!

అయ్యగారటు కుడిప్రక్క బాత్‌రూమ్‌లో స్నానం చేసి, మరి పది పదిహేను నిమిషాల్లో తయారైపోతారు. ఈలోగా సీతారాములు తన డఫేదారు దుస్తులు దరించి, సెక్రటరీ ఆవేళ ఫైల్సు తెచ్చిందీ లేనిదీ, డ్రైవరు క్రిందని కారు ఉంచిందీ లేనిదీ, చూస్తాడు. అయ్యగారు సంతకాలు

పెడుతుంటే సీతారాములు వినయంగా ఆంజనేయుల్లాగా నించుంటాడు. అప్పుడు వాడికి డ్రైవరు క్రిందన అయ్యగారి రాక గమనించకుండా బీడీ కాల్చుకుంటాడేమోననే భయం వేస్తుంది! తాను కూడా ఒక్క బీడిదమ్ము లాగితే బాగుంటుందనే కోరిక కూడా చెలరేగుతుంది. వాడికి బీడీదమ్ము అంటే సుఖం. కాని నిన్నరాత్రి అయ్యగారి మంచం క్రింద తలదూర్చి దొంగదమ్ము లాగింది ఖరీదైన సిగరెట్టు. అటు తర్వాత పరగడుపే!

అయ్యగారు వెనకా, సీతారాములు ముందూ, లిఫ్టులో వస్తారు. అందుకే అందరూ వాణ్ణి పైలెట్ రాములు, డేంజర్ లైట్ రాములు, అంటారు. కసిగా ఉడుక్కుంటారు నౌకర్లు ఆఫీసులో!

“వీడిపాటి గాకపోయామా?” అనుకుంటారు ఒకరితో ఒకరు. రాజభోగం, యింద్రభోగం అయ్యగారంత సుఖం వాడివని వాళ్లల్లో ప్రతీతి ఉంది. ఆఫీసులోనూ, ఇంట్లోనూ అయ్యగారి గది ఏర్ కండిషన్డు. అయ్యగారి భృత్యుడు సీతరాములు.

సీతారాములు ఎక్కడ పుట్టాడో తెలియదు, గాని యీ కొలువు వాడికి పాతిక సంవత్సరాలయ్యింది లభించి. అంతే, వాడి వయస్సు కూడా పాతిక వసంతాలే.. మరి సర్వీసు పాతిక సంవత్సరాలని ఎందుకన్నానంటే వాడు పెరిగింది అయ్యగారి గ్రాంట్సుతో నడిచే శిశు శరణాలయంలోనే. పదేళ్ళ సీతారాములు అయ్యగారింట అడుగు పెట్టేసరికి, అయ్యగారికి వాడంతేఉన్న కొడుకు, అటు తర్వాత ముగ్గురు పిల్లలూ ఉన్నారు. నాటి బంగళా వయస్సు ఆర్నెల్లు. అదే యిప్పుడు నాలుగంతస్థుల భవనం అయిపోయింది.

సీతారాములు అయ్యగారి బూట్లు, పాలీష్ చేసిన రోజులున్నాయి. అవి సోంబాబుతో గోళీలు రహస్యంగా ఆడిన రోజులు. వాడు అయ్యగారికి బట్టలు అందించడం, చేతికర్ర అందించడం చేసిన రోజుల్లో; రెండో అబ్బాయి రాంబాబుని గోళీలాడొద్దని - అచ్చం అయ్యగారి ధోరణిలో మందలించిన రోజులూ ఉన్నాయి!

హమేషా అయ్యగారి కొలువు వాడికి సంప్రాప్తించి అంతా నాలుగేళ్లు.

ఠంచనుగా అయ్యగారి కారు ఆఫీసునుంచి నాలుగున్నరకి యింటికి వస్తుంది. అప్పుడాయన తాను డైరెక్టరుగా వున్న నాలుగైదు కంపెనీల వ్యవహారాలు చూస్తారు. సీతారాములు సలహాలివ్వలేదు. ఇవ్వడు కూడాను. కాని చేతులు కట్టుకుని ప్రక్కన నించొనవల్సిందేను. అయ్యాగారు క్లబ్బు కెడితే కారులో వాడూ ఉండాల్సిందేను.

కొడుకు సోంబాబు పిల్లిలా వస్తాడు. పేద్ద లాయరవుతాడని సోంబాబుని అయ్యగారు మొదట చిన్న కారు కొనియిచ్చి గౌరవించారు. కాని సోంబాబు అసలు లాయరవుతాడూ అని సీతారాములు నమ్మలేదు. అంటే అది అయ్యగారి ఆలోచన అన్నమాట. సోంబాబు కేవలం తండ్రిని చూసి, పాదాభివందనం చేసి, ఆశీర్వాదం పొంది బళ్లోకి పోదామని కాదు వస్త! ఏమైనా కటాక్షం కలిగి ఓ వందా, రెండూ శాంక్షను చేస్తారేమోనని అతగాడు తండ్రినాశ్రయిస్తాడు.

సోంబాబుని అయ్యగారు ఎప్పుడు తల ఎత్తి, పెద్దపులిలా చూస్తారో... అమ్మాయి కళమ్మని

పళ్ళుకొరికి తిడతారో, (కళకి ఏ సమ్మంధమూ నచ్చదు గనుక) సీతారాములికి తెలుస్తుంది. సోంబాబు సీతారాములి మొహంలో నాన్నగారి మనస్సు చదవాలని చూస్తాడు.

"రేపు అకౌంటెంట్‌కి సీతారాములు చెపుతాడు, తీసుకొని పో!... అన్నట్లు; ఏం చదువుతున్నావ్ నువ్వు!"- అయ్యగారి మాటలలో బాధ, నిర్లక్ష్యం ముసుగు ధరిస్తుంది. బాబుకి కావల్సింది డబ్బు. సుఖం ధనంతో కొనగలగడం సోంబాబు నేర్చుకున్నాడు. "లా చదువుతున్నానండీ!" అనేస్తాడు గభిక్కున

"ఒరే రాములూ!" అయ్యగారు కొడుకు వెళ్ళి పోతున్న దిక్కునే చూస్తూ పిలుస్తారు.

"ఇంతకీ రాంబాబు యీ సంవత్సరం పరీక్ష రాశాడా?" అన్న ఆయన ప్రశ్నలో ప్రాధేయత ఉన్నది. సీతారాములికి కూడా అది స్ఫురిస్తుంది.

ఏమనగల్డు వాడు? చిన్న కొడుకు పరీక్ష రాస్తేకదా? అయ్యగారు ప్యాసు చేయించడమేనా చేయగలిగేది? కాలేజీ చదువులంటే మజాగా ఉంటాయన్నది రాంబాబుకి తెల్సును. తెల్సిపోయింది. అందుకనే పరీక్షల్ని దూరంగా ఉంచుతాడతగాడు. ఉన్నమాట అంటే అయ్యగారి కంటిక్రింద చారలు, నుదురు ముడుతలు రెండూ చిక్కుపడిపోతాయి, అందుకనే. "ఈ సంవత్సరం ఔతాడు బాబూ!" అంటాడు వాడు. "డామిట్! వెధవ, ఫేలవుతాడన్నమాట! అంతేవాడు ప్యాసు అవడు నాకు తెల్సు...ఛా! వాడికి బదులు నీకు ఆ డాక్టరీ చెప్పించినా ఈ నాటికి సర్జనౌదువు!" అయ్యగారన్నమాటల్లోని సత్యం ఎంతో తెలియదుగాని, ఆయన బాధ, ఆవేదన మాత్రం నిజం. తనకి అయ్యాగారు డాక్టరీ చెప్పించలేదని విచారంచడం వాడికి కొత్తకాదు. అందుకే ఆశ్చర్యం పోయింది. సీతారాములు చిరునవ్వు నవ్వుతాడు. అంతే!

అయ్యగారి ఆ తపన వాడికొక క్షణం సుఖప్రసాదిని. సీతారాముల్ని అయ్యగారు ఒక్క లాయరూ, డాక్టరూచేయలేనందుకే విచారించరు. "అయ్యో! వెధవా! ఏం చదివినా నిన్ను ఓ డైరక్టర్నేనా చేసుకొందునే... పోనీ!..." అంటారు అంతే. పోనీ తర్వాత ఆ వాక్యం ఎప్పుడూ పూర్తవలేదు. అది ఎలా పూర్తి చేయాలో అయ్యగారికీ తెలీదు; సీతారాములికే తెలీదు.

అయ్యగారికి పిచ్చి ఉందేమోనన్న అనుమానం సీతారాములి గుండెల్లో బరువుగా కూర్చున్న క్షణాలున్నాయి. ఐనా, వాడు బాధని అదుముకోగలడు.

అయ్యాగారికి రెండు మిల్లులున్నాయి. నాలుగు బంగళాలున్నాయి. ఎన్నో 'షేర్లు'న్నాయి. సీతారాములి కేమిటున్నాయో వాడు ఆలోచించుకోలేదు. అయ్యగారంటే వాడికి విశ్వాసముందని అయ్యగారి ఉద్దేశ్యం. ఆయనంటే ఆయనకి లేనట్లే అమ్మగారికీ నమ్మకం లేదు. అది సీతారాములి ఉద్దేశ్యం.

అయ్యగారు కోయంబత్తూర్ మీటింగుకి వెడితే, మధురై ఇన్‌స్పెక్షను కెడితే... విమానాశ్రయం దాకా సీతారాములు వెళ్తాడు. అక్కడ అయ్యగారు ఆఖరిసారి వాణ్ణి చూసి చెయ్యి ఊపిన వైనం వాడెరుగడు. వాడికది ఆట విడుపు!

రివ్వున తిరిగివచ్చి, వాడు అయ్యగారి తోటలో- అసలు అది వాడితోటే ననుకుంటాడని అందరిఉద్దేశ్యం... మరి వాడికి వేరే తోట లేదు... వాడా తోటలో హుర్రేమని పరుగెడతాడు. క్రిందపడి దొర్లేస్తాడు... వాడెన్నోసార్లు అయ్యగారి గదిలో బల్ల పక్కని నేలమీద కూచుని- సీమనించి వచ్చిన బీరూ, విస్కీ తాగేశాడు. అప్పుడు తివాసీ 'పట్టు'లాగా, ఒళ్ళు మత్తుగా, అయ్యింది. కానీ తోటలో వాడిప్పుడు మంచినీళ్ళు తాగేసినా అంతకంటే మత్తుగా, హాయిగా, జోలగా ఉంటుంది!!

అమ్మగారికి వాడు నౌకరు కాదు, అసలు అమ్మగారికి, అయ్యగారికి నాలుగేళ్ళయ్యింది మాటలు లేవు. ఉన్నా, అవి మాటలు కావు. అప్పట్నించే వాడు అయ్యగారి హమేషా నౌకరౌత.

చిన్న అయ్యలికి వాడు డఫేదారు కానేకాదు.

సరిగ్గా తోటలో వాడు హుషారుగా గడ్డిలో పడి దొర్లుతూ వున్నవేళ... మాలచ్చిని తలపోస్తూ ఉన్న తియ్యని సమయంలో ... పెద్దమ్మాయి 'కళ' వస్తుంది. లేదా కాంతి అంటే చిన్నమ్మాయిగారు రావచ్చును.

ఒక్కోసారి అమ్మగారు మూడంతస్థులూ దిగి నడిచి వచ్చి వాణ్ణి "తోటలో ఏంచేస్తున్నావురా... వెర్రి పీనుగా! లోపలికిరా" అన్న సందర్భాలు కూడా ఉన్నాయి.

అసలందుకే ఆటవిడుపు. నాలుగు రోజులూ వాడు పారిపోదామనుకుంటాడు. కాని ఎక్కడికి? ఇంకో ప్రంచమెక్కడ వాడికి?

మాలచ్చిమి చక్కని చుక్క!

వంటయింటి కూరలు తరగడం, బియ్యం బాగు చేయడం మాలచ్చి మిపనులు. మాలచ్చిని చిత్రంగా ఓసారి సీతారాములు రక్షించాడు.

బియ్యంలో ఒక్క రాయి ఉన్నా, అది అన్నంలోకి వచ్చినా దానికి ఫైను తప్పదు. ఐతే సీతారాములు 'కాంతమ్మ'గారు చేసిన ఫిర్యాదు -మీద అయ్యగారి దగ్గర "ఒక్క అయ్యగారి భోజనంలో వస్తేనే కాని... ఇంకెవరి భోజనంలో రాళ్ళు కాదు, కొండలు వచ్చినా ఫర్వాలేదయ్యా!" అనేశాడు.

మాలచ్చిమి రక్షించబడిన రోజున... అది తనను ఎంత హాయిగా, వోరగా చూసిందనీ? ఒళ్ళు పులకరించింది వాడికి. నోట వేసుకున్న పూతరేకు ముక్కలా వాడి గుండె కరిగి పోయినట్లయిపోయింది!

అయ్యగారంటే ఎంత గురో, మాలచ్చిమి అంటే కూడా తనకు అంత 'ఇది' అనుకుఅన్నాడు. ఓసారి వాడు.

ఇటీవల వాడికి మాలచ్చిమితో నేస్తం పెరిగింది. అసలు అదే వాడితో దోస్తీ పెంచుకున్నది. రక్షించబడిన రోజునే 'మామా!' అనేసిందది వాణ్ణి.

కళమ్మ పెద్ద యింగిలీసు క్లాసు చదువుతూంది. ఆ పిల్ల రాక వెల్లకితలా పడుక్కుని మెడ వెనక్కి వాల్చి తల్ల క్రిందులా ఆకాశపుటంచులు చూస్తున్నవాడి కళ్ళ పడింది.

"ఒరే రాములూ! నాన్నగారు కోయంబత్తూర్నుంచి ఎప్పుడొస్తారేం?" అన్నది కళ.

ఉలిక్కిపడ్డ రాములు లేచి కూచుని 'అమ్మాయమ్మా! నేనోమాట అడగనా?" అన్నాడు. ఆపిల్ల

నవ్వింది.

కళ చాలా చక్కగా నవ్వుతుంది. సీతారాములు అడిగేడు. "ఆ బొంబాయి సంబంధం చేసుకోరాదూ!... అంత పెద్ద షేరు బిజినెస్సుగదా వాళ్లది ... లక్ష రూపాయల కట్నం యిస్తారుగదా అయ్యగారు?"

కళ వాడి మాటలకి కోపం తెచ్చుకుని 'నౌకరు వెధవ అధిక ప్రసంగం' అనదు. అనలేదుకూడా. మరీ అందంగా నవ్వుతుంది.

"షేర్లు సుఖం యిస్తాయిరా సీతారాములూ? నువ్వు యిక్కడ యీ గడ్డిలో దొర్లకపోతే నాన్నగారి ఏర్‌కండిషన్డు రూములో హాయిగా నిద్దరోరాదూ?"-

అనలు ఆ ప్రశ్నతోనే వాడికి విచారం పులుముకుంటుంది.

"అమ్మబాబోయ్! ఆ మేజా క్రింద నక్కి నక్కి ఛస్తాను తెలుసా? చలిగా, చల్లగా ఎముకలు మెత్తబారిపోతాయి... ఐనా గాపోయినా కళమ్మా! ... షేర్లు సుఖం ఇవ్వవు, అంటే మరేటి యిస్తాయో?'

"నీకు తెలియదుగానీ... ఆ చిన్నకారు నాకు కావాలి. షెడ్డు తాళాలియ్యి... పోతాను..."

కళ ప్రేమ ప్రవాహంలో కొట్టుకు పోతున్నదని కవిత్వం మినహాగా అనుకున్నాడు సీతారాములు కాని... అందుకే అయ్యగారి మాటల పాఠంతో వచ్చిన వాక్యం అనేశాడు.

"గొప్పింటి బిడ్డవని మరిచిపోకమ్మా! ఎట్నించి ఏమొచ్చినా మా గుండెలమీద కుంపటవుతాది.'

"ఛా! నోరుముయ్యి... నీ గుండెల మీద కేమొచ్చింది? ఒరే! నువ్వు అయ్యగార్ని ప్రేమించే మిషనువిరా, రాముడూ? ఆయనకి పరువు, హోదా చాలురా! నాకు ముందు కారు తాళాలియ్యి... మళ్లీ అమ్మ చూసిందో తిడుతుంది..."బ్రతిమాలుతుంది.

"ఒంటరిగా వెళ్లి యిట్టే వస్తానని 'ప్రమాణం' చెయ్యి" అన్నాడు సీతారాములికి భయం నిజంగానే ఉంది, కళమ్మ ఏ మగపిల్లవాడితోనో వెళ్తుందని...

కళకి తెల్సు, వాడికి తనమీద చెల్లెలి మీద ఉన్నంత వాత్సల్యం ఉన్నదని; వాడు కళని చిన్నప్పుడు ఎత్తుకుని, ఎత్తుకోలేక ఎత్తేసినప్పుడు అమ్మ కేకలేస్తే; నాన్న..."వాడు వాళ్ళ అన్నయ్యే అవుతే ఏం చేస్తావే?" నని అమ్మని కేకలేయడం, అమ్మ యిప్పటికీ అవసరం వచ్చినప్పుడు అది తల్చుకుని మండిపడటం ఆ పిల్లకి తెల్సును.

"ప్రామిస్, సరేనా? ఓరబ్బీ! ప్రేమంటే తెలీదురా నీకు... తాళాలు యిలా పారేయ్!" మని ఆ పిల్ల తాళాలు లాక్కుని పారిపోయింది.

"మాలచ్చిమీ! యీ అమ్మాయి పరువు తీస్తాందే! ఎట్లా చావడం? ... అయ్యో దేముడా! యిక ఆ కాంతమ్మ లీలలు, వేషాలు... అయ్యగారికి సుఖంలేదే!..." వాడు మాలచ్చిమిని తల్చుకుని బాధ వెళ్ళబోసుకుంటాడు.

అదే వేళకి ఒక్కోసారి మాలచ్చిమి వస్తుంది, వెలిగించిన దీపంలాగుంటుందది! అలాంటప్పుడు వాడికి అంతలో కళ "ప్రేమిస్తే తెలుస్తుందిరా" అన్న మాటలు స్ఫురించేయి. "ఛా! నేను మాలచ్చిమిని ప్రేమిస్తున్నా నన్నమాట" అనుకుని వాడంతలో సిగ్గుపడిపోయి, రెండు గడ్డిపరకలు అమాంతం పీకి కొరికేశాడు.

"ఛీ! ఏంటి మావోఁ!... లచ్చాదిగోరి తర్వాత అంతోడివి.. యీ గడ్డి కతుకు టేంటీ?" - మాలచ్చిమి రానే వచ్చింది. హాయ్ హాయ్! దాని కుత్తుకలో కత్తులే ఉన్నాయి. దాని స్వరం చెవుల్లోనించి గుండెల్లోకి కరెంటు వదుల్తుంది.

"ఏంటో, మాలక్ష్మీ! సుకం లేదే..." అన్నాడు- అచ్చం అయ్యగారు బోలెడు ఫ్యాక్టరీల డైరెక్టరు, మిల్లు యజమాని, అందమైన అంతస్తుల మేడల సొంతదారు. నలుగురు పిల్లల తండ్రి- అపురూపమైన అందమైన గదిలో కూచుని-అన్నమాటలు, అనుకొనే మాటలు అవే... అవే సీతారాములూ అన్నాడు.

"ఛీ! ఏంటి సుకం తక్కువ మాఁవా నీకు?- ఆకరికి నీ బాసకూడా గొప్పోళ్ళదే అయ్యిందే!... నన్ను మాలషిమి అనొద్దు... మాలచిమి అనాల" అంటూ అలుక ప్రదర్శించి అంతలో యిసింటా జరిగి, జారిన పైటనైనా గుర్తించకుండా యిలా అంది "ఈ గొప్పోళ్ళ గోత్రాలు మా చెడ్డవి- అమ్మగారికి అయ్యోగోరంటే ఉలుకు... అయ్యగారికి అమ్మగారంటే బెయమూను! నా మాటిను... నాలుగెనకేసుకో!... "మా లచ్చిమి హితబోధ వాడికి మరీ కొత్తది కాదు; మరీ పాతదీ కాదు. అది గుండె మీద చెయ్యి వేసింది!

అంత అందమైన చెయ్యి కూడా నాగుబాము పడగలా తగిలింది.

"అయ్యగారె వెరనుకున్నా వేంటీ?" వాడు మధన పడతాడు.

"ఎవరో, ఎవరైతేనేం? నీ కన్న తండ్రిరా? కనుక్కున్న బిడ్డా?" -అలక; యీసారి నిజమైనదే మాలచ్చిమిది.

అయ్యగారు అయ్యగారే... ననుకున్నాడు సీతారములు. వాడికి కన్నతండ్రీ తెలియదు. తల్లినీ ఎరుగడు వాడు.

మాలచ్చిమి ప్రయత్నాలలో వాడికి అయ్యగారి కష్టాలు అప్పుడప్పుడు కొంచెం చులకన అయినా, అవి సాధారణంగా గుండెల్లో బరువుగానే నాటుతాయి.

"ఏంటో సుకంలే"దన్నాడు- వెంటనే "అమ్మగారు నిన్ను పిలుసుక రమ్మందని" మాలచ్చిమి వెనుదిరిగి నడక సాగించింది.

"కాంతమ్మగారి ఖర్చులు మితిమీరిపోయినాయి మామా!..." అని మాలచ్చిమి చెప్పినప్ప బాధ యింకా వాడి గుండెల్లో పీకుతూండగానే సీతారాములు మాలచ్చిమిని అనుసరించాడు.

అమ్మగారు పిలిపించిందంటే హడలిపోలేదు సీతారాములు... వాడికి సుఖంగా, ఆరుబయట, ఆకాశం, మేఘాలు, దుమ్మూ, ధూళీ, బురదా అన్నీ దొరికి నాలుగు గడియలేనా అవలేదు. బాధగా వుంది. వాడికి ప్రేమించడం గురించి కళమ్మ తెలియజేసిన రహస్యం యింకా అప్పుడే అవగాహన అయ్యింది. అట్టి తియ్యని అనుభూతికేనా తీరిక లేదు.

అమ్మగారు చెయ్యెత్తు మనిషి.

"ఏమిరా, సీతా! మీ అయ్యగారు క్యాంపు కెడితే నీకింక తిండీ, తిప్పలూ ఏమీ అక్కర్లేదా? అలా కూచో!... "నాయరూ! వీడికి అన్నీ వడ్డించి అవతలికిపో... నే చూస్తూ వుండగా వీడివాళ భోజనం చేయ్యాలి"-

"అమ్మగారూ! నాకాకలిగా లేదండీ!" సీతారాములికి ఆకలిగా ఉంది గానీ, తినాలని లేదు.

"బాగుందిరా! నీకు వేరే కొంపా, గోడూ ఉన్నాయిరా?... నీ ఆకలి నాకు తెలియదా? లేకపోతే నీకు వేరే ఎవతేనా, మరదలు పిల్ల ఉన్నాదా? గంప ఎత్తుకొచ్చి ముంతముద్దలెట్టడానికి? రా! తిను... వూ(!"- అమ్మగారు గద్దించింది.

వాడు కిక్కురుమనకుండా కూచున్నాడు. అమ్మగారన్నమాటలు వింటూ వుంటే మాలచ్చిమి, దాని కొంగున కట్టుకొచ్చిన కూడు 'రుచి' జ్ఞాపకానికి వచ్చాయి.

"ఈ సంస్కారం... యీ ఖరీదైన భోజనం... యిందులో లేని సుఖం యెక్కడో వుంద" నిపించింది వాడి గుండెల్లో ఎవరో చెప్పినట్లు.

"అయితే రాముడూ!... మీ అయ్యగారు మొన్న కట్టిన కొత్త బంగాళా, ఎవరి పేరున పెడదామనుకుంటున్నారు?"

"వీడు నౌకరా?కాడు..." అని లోపల లోపల వాణ్ణి తిట్టుకుంటూనే అమ్మగారడిగింది.

ఆమె వేసిన ప్రశ్నలో విపరీతం, విచిత్రం గోచరించదు సీతారాములికి. అయ్యగారిని తానేపోయి అమ్మగారు ప్రశ్నలు అడగ్గలగడం, పనులు సాధించుకోడం; ఈ రెండూ నాలుగు సంవత్సరాల వెనుకటి మాటలు!

వాడి సమాధానం యిది:

"అమ్మా! కళమ్మగారికోసం అయ్యగారు తెచ్చిన లక్ష రూపాయలసమ్మందం మీరు నచ్చ చెప్పరాదూ?"

పెద్దింటి విషయాలు నీ కెందుకురా అనగల ధైర్యం ఆమెకు లేదు.

అమ్మగా రొకనాడు పెట్టిన భోజనం అయ్యగారు విసిరేసి... ఇక "నీ మాట, నీ తిండి రెండూ నాకు విషమే!... ఇక నీ చేతి తిండి, నే తిన" నన్నప్పుడు సీతారాములొక్కడే అక్కడ సాక్షిలా నిలబడ్డాడు. ఆ నిజం నాలుగో కంటివాడికి తెలియకపోవడమే సీతారాములి సంస్కారం-

"అది కాదురా!... యీ బంగళా ఎనభై వేలు చేస్తుందటగా!... మళ్ళీ ఆ 'రంజన' పేరిట రాస్తారా?... అయినా గాకపోయినా యీ వయస్సులోయింత పరువు తక్కువ పనులు చేయడం నా ఖర్మరా!..." అంతలోనే ఆమె కుతూహలం బాధ, బాధ, దిగులూ అయిపోయింది.

"లేదమ్మా! అయ్య మీటింగ్ అడావుడిలో పడిపోయాడు. ఒక వేళ అది కళమ్మకి పెళ్ళి కానుకగా రాస్తారేమో?"సీతారాములికి కొత్త బంగళా అయ్యగారు రంజన పేరునా కాదూ, కళ పేరునా కాదు. మరో అందాల తారకి రాస్తానని వంటిమీద తెలివి లేనప్పుడు ఒప్పేసుకున్నారని తెలుసు! అయినా

చెప్పడు.

"అమ్మా! అయ్యగారి చిన్నతమ్ముడు సీమనుంచి వస్తాడంటగా..." వాడి భోజనం ముగియ వచ్చింది.

"ఛీ! వాడా? అప్రాచ్యపు వెధవ!... ఏ దొరసానినో కట్టుకుని వస్తాడటగా!..." ఆమె అసహ్యం అంతలో పోయి దిగులు మళ్ళీ ప్రత్యక్షం... "అసలు యిల్లాలిని దు:ఖపెట్టే వంశంరా వాళ్ళది..." ఆమె నౌకరు ముందు దొరికిపోతున్నానని మళ్ళీ దు:ఖమంతా దాచుకుంటోంది!

"అయితే మా శేఖరం మీద ఆయన కోపం చల్లారలేదా?"

శేఖరం అమ్మగారి మేనల్లుడు. కాంతికి తగిన వరుడని ఆమె నమ్మకం కూడాను. కాంతికి కూడా బావ అంటే నమ్మకమే!

అయ్యగారు అతగాడికి బ్యాంకులో మంచి ఉద్యోగం వేయిస్తే డబ్బు తీసుకొని స్కూటరు కొనుక్కున్నాడతగాడు. ఏమంటే కాంతి సరదా పడిందన్నాడు. 'అయ్యగారు' ధర్మరాజు గనక జైలు ప్రాప్తి తప్పిందన్నాడు ఆరోజున సీతారాములు. 'ఈ జన్మలో వాడి మొహం నాకు అగుపించనీయకు' అన్నారు అయ్యగారు శేఖరాన్ని ఉద్దేశించి

"అమ్మా! కాంతమ్మకి అల్లుడి సమ్మందం అయ్య ఒప్పుకోరమ్మా!" అన్నాడు సీతారాములు.

"ఔను! కోటీశ్వరుడి బంధిఖానాలో నాకు అధికారం ఏముంది?... అంతా ఆయన ఇష్టమే! చెక్కుబుక్కులో నుంచి కాగితాలు సంతకాలు పెట్టి ఎంత కావాలో వేసుకోమని ఆయన బజారుముం' ఆవిడ ఆగిపోయింది. కారణం పిక్‌నిక్‌కని వెళ్లిన కాంతి రివ్వున వచ్చేసింది!

"మరేం...మరేం.. బావా, నేనూ వెళుతూ వుంటేనూ స్కూటర్ తోవలో.. తోవలో తుమ్మచెట్టును గుద్దేశిందే!" రొప్పుతూ చెప్పింది.

"అయ్యో! అయ్యో!" కూతుర్ని గుండెలకదుముకుని ఆందోళన పడిపోయింది అమ్మగారు. "దెబ్బ తగల్లేదుకద! అయ్యో! యింతకీ బావేడీ?"

"బావ... బావ..." కాంతి గొంతుక బెక్కెట్టింది. సీతారాములికి భయం వేసింది. అమ్మగారిగుండె జారిపోయింది.

కాంతి ఏం ఉపద్రవకరమైన వార్తచెబుతుందోనని యిద్దరూ వినడానికి భయపడ్డారు. కాంతి నిజంగా గాభరా పడ్డది.

"మరేమో... తను గంతేసి... నన్ను నన్ను" తల్లి గుండెల్లో సిగ్గుపడి తలదాచుకుంది... ఆ వాక్యం సగంలోనే పూర్తైపోయింది.

నిశ్చితంగా అమ్మగారు నిట్టూర్చింది.

సీతారాములు ఫక్కున నవ్వేశాడు.

"ప్రయోజకుడే నండమ్మా!... అల్లుడూ" అన్నాడు.

"ఛీ!ఫో! నౌకరు వెధ..."అని కాంతి తిట్టలేక పోయింది కాని, ఆ పిల్ల కళ్ళల్లో కోపం

తాండవించింది.

"ఛీ! అయ్యగారి ముక్కు, మొహంపోలి పుట్టినావుగాని, ఆ గుణం రాలేదు తల్లీ! నీకు... కళమ్మకున్న సాత్వికం లేదు... నీకు... నీకూ-" ఏమనాలో తెలియక సీతారాములు "అత్తకొడుకు బావే సరి" అనేశాడు.

అమ్మగారు కూడా నవ్వు దాచుకొని "నువ్వ పోరా అవతలకి" అనేసింది.

వెళుతూవున్న సీతారాములి చెవిలో కాంతి మాటలు "ఈ వెధవని తగిలేస్తేగాని మనకి సుఖం లేదే!" అన్నవి స్పష్టంగా పడ్డాయి.

వాడేమీ అనలేదు. అనుకోలేదు.

## 2

మాలచ్చిమిని చూసి ఆశ్చర్యపోయాడు సీతారాములు. ఉలిక్కిపడ్డాడు. "ఇది మా కాంతమ్మ చీరెలాగుందే... యింత ఖరీదైనచీరె నీకెక్కడిదీ?" అనేద్దా మనుకున్నాడు. అనేశాడు కూడాను.

"చా! నాకేడదా?... మీ కాంతమ్మది నాకెందుకేంటి?... నేను కొనలేనా? గింతచీరె..." ఒయ్యారంగా, విలాసంగా నవ్వేసింది మాలచ్చిమి.

"ఛా! చెప్పుమంటే? యిదెంత ఖరీదో తెలుసా?"

"తెల్దు మామా! నీయంత గొప్ప నాకేడదీ? ఉత్త పల్టూరిదాన్ననేగా నీ యిది..." నొచ్చుకుంది. మాలచ్చిమి - అన్నది "స్టారులా గుంటానంట తెల్సా? గింత మహా పట్నవోసం నడిబొడ్డున నాబొడ్డు కోసినారు, తెల్సా? మాయమ్మది యిసాపట్నం"-

అందులో అది అంత నొచ్చుకుని గిలగిల లాడి పోవల్సింది ఏమున్నదో... దాన్ని 'స్టారులా గున్నా' వని ఎవరన్నారో సీతారాములికి తెలిసింది కాదు.

"ఛా! ఎందుకే పిల్లా నీకంత రోసం?... నువ్వు చక్కని చుక్కవే లే? - పో... నేను పోవాలి అయ్యగారు మంచంమీదున్నారు..." - బుగ్గమీద చిటికెవేసి పరిగెట్టేడు సీతారాములు.

అయ్యగారికి జబ్బుచేసింది! రెండు హమేషాలుంటున్నాడాయన్ని కనిపెట్టుగుని సీతారాములు.

ఆరుగురు డాక్టర్లు వచ్చారు! అయ్యగారు నాటికి ఆరవరోజున మధురై వెళ్ళవల్సివున్నది గనక, ఐదురోజుల్లో ఆయనను బాగు చెయ్యాలని ప్రయత్నం చేస్తున్నారు.

అయ్యగారికి మందు తాగాలన్నా భయమే! ఆయన కడుపునొప్పి వార్త ఎలా తెల్సిందో ఐదారు వందల మైళ్ళ పరిధిలో ఉన్న దాయాది బృందమంతా వచ్చి వాలి పోయింది.

సీతారాములికి కంట కునుకు లేదు. అయ్యగారి కడుపునొప్పికి ఆయన మీద కనికరంలేదు.

అయ్యగారికి ఏర్ కండిషన్డు రైలుబండిలో రిజర్వైన రెండు సీట్లు రద్దు చేసి తీరాలన్నారు డాక్టర్లు. వీల్లేదు ఏడో తేదీ ఉదయం నేను మధురైలో ఉండాలన్నారు అయ్యగారు.

"ఒరే రాములూ! నువ్వు యీసారి కూడా నాతో రావాల్సిరా!..." అయ్యగారు యిటీవల వాడికి

సుఖాన్నీ, ఆటవిడుపునీ యివ్వడం లేదు. ఎక్కడకు వెళ్ళినా వాడుకూడా ఆయనతో పాటు ఉండాల్సిందే.

వాడికి అయ్యగారిని వదిలి ఉండడం యిష్టంలేదు. గాని... అస్సలు మాలచ్చిమిని చూపిందికైనా, తోటలో పిచ్చిగా పరుగులుతీసింది కేనా లేదని బాధ స్పష్టంగా ఉంది.

మాలచ్చిమి కనిపించినప్పుడేనా, దాని కులుకు, షోకు ఎక్కువగానే ఉన్నది గాని, వాడికిమల్లే దానికి, యెడబాటు బాధ తెలిసినట్లు కనిపించడం లేదు. అదీ వాడికి బెంగే అయికూచుంది. మాలచ్చిమి ఖరీదైన చీరెలు, నగలు ఎలా సంపాదిస్తున్నదనే ప్రశ్న వాడిలో ఉదయించిందే గాని, అది యింకా అనుమానం అవలేదు. దొంగతనం, వెనకేసుకోవడం అనే రెండు లక్షణాలను సైతం దానికి అంటకట్టడం వాడికి యిష్టం లేదు.

అయ్యగారు తనకేసి చూసిన ఒక ఒంటరివేళ సీతారాములన్నాడు.

"అయ్యా! ఆరోగ్యం బాగులేదు. ఇన్‌స్పెక్షనూ వద్దు. ప్రయాణమూ వద్దు... నా మాట వినండి' వాడు రెండు చేతులతోనూ అయ్యగారి పాదాలను మెత్తగా పట్టుకున్నాడు.

"కాదురా!... నువ్వు మధురైపద... నా కోసరం రిజర్వుచేసిన రైల్లో పద... ఫైల్సు తీసుకో! .. సెక్రటరీ నాతో వస్తాడు... నాకుబ్రతికి సుఖంలేదురా రాముడూ!..."అయ్యగారు నిర్ధారణగా మాటాడ్డమే తతిమ్మా జనం ఎరుగును కాని, సీతారాములు ఆయన బేలమాటలు కూడా వినగలడు.

"వద్దయ్యా! మీకు లేని సుకమేంటీ? కోటీశ్వరులు!..."

"వెళ్ళరా! నేను వచ్చి నీకు చెపుతాగ... వెళ్ళు"... అయ్యగారికి హుకుం యివ్వడం ఒక్కటే తెల్సునని నౌకర్లందరికి తెల్సినసంగతి సీతారాములు కూడా ఎప్పుడూ కొట్టిపారే లేదు.

"సరేనయ్యా!" అన్నాడు. అన్నాడు కాని, గుండెలు జారిపోయాయి వాడికి. ఎక్కడి మధురై? ఎక్కడితను! అసలు తనెవడు అయ్యగారి సీట్లో కూచుని వెళ్ళడానికి?'

"నీపుణ్యం ఏంటోగాని, దిక్కుమాలిన వాడివైతేనేం గాని, రాజభోగంరా నీది" అనేశాడు బ్యాగ్ నందుకుంటూ డాక్టరు. డాక్టరు అలా అంటూ వాడి వీపుమీద కసిగా చరిచిన చరుపు యింత పిసరు వాడికి ఆనలేదు... మాటలు మాత్రం గుండెల్లో పొడుచుకున్నాయి.

"ఛీ! బ్రతుక్కి సుకం లేదు" అన్నది వాడి అంతరాత్మ.

"ఛీ! యిప్పుడే పోయి రాజీనామా యిస్తాను. దిక్కు మాలిన బ్రతుకు... చస్తా" నన్నాడు గట్టిగా. విసురన అయ్యగారి దగ్గరికి చరచరా వెళ్ళేడు.

"ఇష్!... బయటికి నడు!" అన్నది నర్సు. అయ్యగారికి నిద్రపట్టింది కాబోలు. సీతారాములు బయటికి నడిచేడు. అయ్యగారు కన్నుమూస్తే తనెవరింక? నౌకరు...నౌకర్లకి కూడా కిట్టని నౌకరు.

వాడి గుండెల నేదో నమిలేసినట్లయింది.

సెక్రటరీ వచ్చి కేకలేశాడు. "పదరా స్టేషనుకి దొరా! అంతా రెడీ!" అన్నాడు.

సీతారాములికి అయ్యగారిని వదిలి వెళ్లబుద్ధి అవలేదు. 'మరి అయ్యకి విమానం బుక్‌చేశారా?'

వాడి ప్రశ్నకి సెక్రటరీ ఎంతో వెటకారంగా "చిత్తం!" అన్నాడు.

సీతారములికి అయ్యగారిని వదిలి వెళ్లబుద్ధయ్యింది గాదు. వెళ్ళక తప్పిందికాదు.

## 3

రైలుస్టేషన్ చాలా పెద్దది. విచిత్రం గాలేదు సీతారాములికి. అది వాడికి అలవాటైన స్టేషను. వాడుయింకా పెద్ద స్టేషన్లు చూశాడు. కాని అంతా కొత్తగా ఉంది.

"ఇవి లక్షలకి విలువైనకాగితాలు. ఒరే! భద్రం సుమా!... రెండు సీట్లూ నీకే!... ఏర్ కండిషన్డురా బాబూ! వెళ్ళు వెళ్ళు... అక్కడ అయ్యగారికి ఫాక్టరీవా ళ్ళిచ్చిన రూమ్‌లో యివి పెట్టుకో!"...

సెక్రటరీ సాగనంపుతూ చెప్పేడు.

సీతారాములికి గుండెలు పీకుతున్నట్లుంది. రైలు నిర్దాక్షిణ్యంగా కదిలిపోయింది. వాడు అయ్యగారి పెట్టె నొక సీటులో ఉంచాడు. రెండో దానిలో తాను ఒదిగి కూచున్నాడు.

రైల్లో చలిగా చల్లగా ఉంది. బయట చిక్కగా చీకటి ఉందనుకున్నాడు. లోపల ఆకుపచ్చ దీపం.

మెత్తని సీటు వాడికి ముళ్ళకంచెలా ఉంది.

వాడు జేబు పట్టుకుని ముడుచుకుని కూచున్నాడు. కునుకు రానేలేదు. జేబులో ఐదువందల రూపాయలున్నాయి. అక్కడ హోటల్లో ఎవరికో కట్టాలన్నాడు సెకరట్రీ.

అసలు తాను ఎక్కడికి వెలుతున్నదీ మరచిపోయాడు. సీతారాములు. వాడికి అయ్యగారి కడుపునొప్పి గురించి బెంగ.

కళమ్మ పెళ్ళి గురించి తలపోత లొచ్చాయి. "ఇంచక్కా పిల్ల ఆ బొంబాయి సంబంధం ఒప్పుకుంటే అయ్యగారికి సుకం ఉంటుందనుకున్నాడు కాని కళ కాలేజీలో ఎవర్నో ప్రేమించిందన్న అనుమానం వాడికి పోలేదు. సీతారాములకి భయం వేసింది!

కళ ప్రేమవ్యవహారంగాని, కాంతి పెళ్ళి విషయంగాని అయ్యగారికి తెలిస్తే ఆయన రివాల్వర్ తీసి ఆ ఇద్దర్నీ కాల్చేస్తాడు.

సీతారాములు కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. రైలు వెడుతున్నదో... అవతల వెలుతురున్నదో.. బయట ప్రపంచమెలా యున్నదో ... పగలో ... రాత్రో!...

వాడు ముడుచుకుని కూచున్నాడు. చలిగా ఉంది. బాధగానూ ఉంది. మాలచ్చిమిగురించి జ్ఞాపకం వచ్చింది.

"మాలచ్చిమి కంతడబ్బు ఎక్కణ్ణించివస్తున్నదో!...." అన్న అనుమానం వచ్చింది. అది సిల్కుచీరె కట్టుగుంటున్నది. బంగారం గొలుసు చేయించుకుంది.

"కోటీశ్వరుడి తర్వాత అంతోడు; నీ నీడుండగా నాకు కొదవేంటి?" అన్నదది. వాడు జుట్టు పీక్కున్నాడు. దాని మాటలు వాడి కర్థం అవలేదు.

అయ్యగారికి ఎన్నో రహస్యాలున్నాయని, అవన్నీ తనకు తెలుసునని - అందరూ అనుకుంటారు. కాని అయ్యగారికి సుకంలేదన్న రహస్యం ఒక్కటే కదా తనకు తెలుసు?

అయ్యగారి రహస్యాలు...? వాడు ఆలోచనలలో పడి సుడి గుండంలోపడ్డ పడవలాగా గిరి గిర తిరిగేడు.

పెద్ద కొడుకు లాయరవలేదని... కారు తాకట్టుపెట్టి డబ్బు ఖర్చుచేశాడనీ అయ్యగారికి బెంగ.

చిన్న కొడుకు తన సంతకం ఫోర్జరీచేశాడనీ, చెక్కుమార్చుకున్నాడ నీ ఆయన బాధ.

కళ ఎన్ని సంబంధాలు చూసినా, చేసుకోనంటున్న దనీ ఆయనకి కోపం.

తమ్ముడు దొరసానిని చేసుకొని సీమనించి దిగబోతున్నాడనీ ఆయనకి దిగులు!

ఆయన 'రంజన'కి బంగళా యిచ్చేసిందికి కారణం... అమ్మగారిమీదికోపం.. క్లబ్బులకు చెక్కుబుక్కు తీసికెళ్ళడానికి అమ్మగారిమీద ఆయనకు పోయిన నమ్మకమే కారణం.

సీతారాములికి నిద్ర రాలేదు. ఆకలి వేయలేదు. రైలుబండి ఐదువందల మైళ్ళు, ఆగుతూ పరిగెడుతూనే వుంది.

"బాబోయ్! ఈ ఉద్యోగం వదులుకుంటాను. దిక్కు మాలినవాణ్ణి... నాకు ఈ అయ్యగారితో సంబంధం ఏమిటి? తిరిగివచ్చి నౌకరీ వదిలేస్తాను. మాలచ్చిమితో మరోవూరు పోతాను.." అని గట్టిగానే అనుకున్నాడు వాడు.

అందరూ గొప్పవాళ్ళు ప్రయాణంచేసే ఆ రైలు పెట్టెలో సీతారాములి మాటలు ఎవ్వరికీ వినించలేదు. నిద్ర... చలి... అందులో రెండోది సీతారాముల్ది, మొదటిది తతిమ్మావాళ్ళది.

సీతారాము లదివరకు, అయ్యగారు, ఆయన సమస్యలు వీటి గురించే బాధపడేవాడు. మాలచ్చిమికి కూడా వాడు తన బాధ చెప్పేవాడు కాదు. దాని కులుకు వెంటనే చచ్చి పోతుందని భయం. దానికి అయ్యగారిమీద ప్రేమలేదు.

తోటలో ఒక్కడే పాలపిట్టలతో చెప్పుకునేవాడు.

తోటలో ఒక్కడే బాటప్రక్కని వున్న ఒంటిరేక బంతి పువ్వుతో చెప్పుకునేవాడు.

తనెక్కణ్ణించి వచ్చాడో? అస లీ అయ్యగా రెందుకు తన నిటువంటి ఉద్యోగంలో ఉంచుకున్నాడో? అయ్యగారినే అడగాలని చాలాసార్లు అనుకున్నాడు.

అడగలేకపోయాడు.

## 4

మధురై స్టేషనులో దిగిరమ్మని పోలీసులు వచ్చి దిగమనేవరకూ వాడు ఆలోచిస్తూనే ఉన్నాడు.

వాడు బిక్కచచ్చిపోయాడు. వాడిభాష పోలీసులకి గాని పోలీసు భాషవాడికిగానీ తెలియలేదు.

సీతారాములకి ప్రపంచంమీద కోపం వచ్చింది.

తనను అందరూ హింసపెడుతున్నట్లే అనిపించింది. "ఛీ! అంతా అయ్యగారినించే వచ్చింది... ఛీ! ఆయన పాడు ఉద్యోగం మరి చెయ్యను.రాజీనామ ఇచ్చేస్తా"నంటూ వాడు గావుకేకవేశాడు.

లాభం లేపోయింది.

పోలీసులే వాణ్ణి మరి అరుగంటలు తర్వాత పెద్ద హోటల్లో అయ్యగారి పేర రిజర్వయిన రూమ్‌లో వదిలిపెట్టేరు.

సీతారాములికి "అయ్యగారు వస్తారుకదా యిక ఆయనకి చెప్పేస్తానుకదా... ఈ నరకం వాకొద్దని" అనే ధైర్యం వెంటనే వచ్చింది.

గదిలో అయ్యగారి సామానులన్నీ పెట్టి గది ముందు కూచున్నాడు. కళ్ళు కాయలు కాసేయి.

శరీరం పీక్కుపోయింది. విమానంలో రావల్సిన అయ్యగారు రాలేదు. వాడి ధైర్యం దిగజారిపోయింది.

అయ్యగారు రాగావే వాడు పారిపోదామనుకున్నాడు. ఇక విముక్తి లభిస్తుందన్న నమ్మకం వన్నగిలిపోగానే వాడు ఫ్యాక్టరీకి పరుగెత్తాడు!

వాణ్ణి చూసి "మీ అయ్యగారికి ఆపరేషన్ చేస్తారుట. రేపు నువ్వు తిరిగి పో!"" అన్నాడు మేనేజరు.

సీతారాములికి గుండె జారిపోయాయి. మేనేజరిచ్చిన టిక్కెట్టు, అయ్యగారి సామానుతో వాడు రైలెక్కాడు.

రైలు, వాడు అందులో కూచున్నా, యీసారి వాడి గుండెలమీదే పరిగెత్తింది! చెవుల్లోనేహోరెత్తింది! "అసలునే నెవరు? నన్నెందుకీ నరకానికి అయ్యగారు గురిచేశారు? ఆయన్నే అడుగుదా" మనుకున్నాడు. ఐదువందలమైళ్ళ దూరం రైలులో వుండి. "అప్పటికిగాని తనకి సుకంలే' 'దనుకున్నాడు.

సీతారాముల్నివ్వరూ పోల్చలేనంతగా పీక్కుపోయాడు. వాడు బంగాళా చేరుకొనేసరికి ... వాణ్ణి వాడే పోల్చుకోలేకపోయేడు.

అక్కడ అయ్యగారి మరణవార్త వాడి చెవుల్లో పడింది! వాడు పరిగెత్తేడు. పరిగెడుతూ - తోటలో మొక్కలకి నీరు పెట్టే కాలువపలవార ఒంటిరేక గడ్డిబంతి పువ్వు దగ్గర పడి పోయాడు.

"అయ్యగారు సుకపడ్డాడు నేస్తం.... విన్నావా? నన్ను మాత్రం ... నన్నుమాత్రం ... అసలు నే నెవరు?..... నే నెవరు?...."

గడ్డిబంతిపువ్వు తలూచిందికాని మాటాడలేదు, సీతారాములి ఆఖరిమాటలు విన్నదొక్క ఆ పువ్వేను. మరెవరూ వాణ్ణి చూడలేదు. అయ్యగారు ప్రాణం విడుస్తూ "నాయనా నా రాములూ!" అన్న మాటలూ-సీతారాములు వినలేదు. అయ్యగారి "సుఖంలేదన్న" మాట ఒక్కటే వాడికి దక్కింది.

సుఖం దక్కిందికాదు.

రహస్యం - తాను ఎవరన్న "రహస్యం"-కూడా చిక్కింది కాదు!!

**(1961, ఆంధ్రపత్రిక వారపత్రిక)**